సాక్షి
గుంటూరు
బుధవారం, 29, మే, 2024



దేవదాయ శాఖ అధికారుల సందర్శన

పిట్టలవానిపాలెం: చందోలులోని లింగోద్భవ స్వామి, చెన్నకేశవస్వామి, బగళాముఖి ఆలయాలను రాష్ట్ర దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం సందర్శించారు.



హనుమత్ జయంతి మహోత్సవాలు

నగరంపాలెం: పాతగుంటూరు విశాఖ శారదా పీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.



నగర సంకీర్తన

సత్తెనపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం పట్టణంలో భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లోకేష్‌కు మళ్లీ మంగళమేనా!

- మంగళగిరిలో నెగ్గితే సరేసరి
- లేదంటే రాజకీయంగా అధోగతేనా?
- కంగారుపడుతున్న టీడీపీ క్యాడర్
- పోల్ మేనేజ్‌మెంట్ లెక్కలు తప్పాయా..
- వ్యూహాత్మకంగా వ్యవహరించిన వైఎస్సార్ సీపీ
- మురుగుడు లావణ్యకు కలిసొచ్చే కాలమంటున్న పరిశీలకులు



మంగళగిరి నగరంలో ఎమ్మెల్యే ఆర్కే అభివృద్ధి చేసిన గౌతమ బుద్ధా రోడ్డు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మూడు శాఖల మాజీ మంత్రి, మాజీ సీఎం చంద్రబాబు తనయుడు నారా లోకేష్‌కు పరీక్షా సమయమిది. మంగళగిరి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసిన ఆయన ఈసారైనా గట్టెక్కగలిగితే ఊపిరి పీల్చుకున్నట్లే. లేదంటే రాజకీయంగా అధోగతే అనే అనుమానాలు స్వపక్షీయుల్లోని సీనియర్లు, శ్రేణుల నుంచే వినిపిస్తున్నాయి. పోలింగ్ అనంతరం విభిన్న కోణాల్లో వేసుకుంటున్న అంచనాలలో అంతర్గత అనుమానాలు అనేకం ఉన్నప్పటికీ బయటకు మాత్రం టీడీపీ గెలుపుపై మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

తొలి అడుగులే తడబాటుతో..

రాష్ట్ర విభజనానంతరం అధికారంలోకి వచ్చి అమరావతిని రాజధాని కేంద్రంగా ప్రకటించి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని విస్తృతపరచిన నాటి పాలకపక్షానికి గుంటూరు, కృష్ణా జిల్లా ప్రజలు తగురీతినే బుద్ధి చెప్పారు. 2019 సాధారణ ఎన్నికల్లో, ఆ తరువాత జరిగిన గుంటూరు, విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీకి కర్రుకాల్చి వాతపెట్టారు. కరకట్ట వెంట అక్రమ కట్టడంలో నివాసం ఉంటూ వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకుండానే ఎమ్మెల్సీగా ఎంపికై మూడు శాఖల మంత్రిగా కొనసాగిన లోకేష్ మంగళగిరి నియోజకవర్గానికి ప్రత్యేకంగా చేసిందంటూ ఏమీలేదనే విమర్శలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేతిలో పరాజయం పాలైన లోకేష్ ఆ తరువాత అయినా రాజకీయంగా వ్యూహాత్మక అడుగులు వేశారా అంటే అదీ లేదు. టీడీపీ ఆవిర్భావ సమయంలో 1983, 1985 ఎంఎస్ఎస్ కోటేశ్వర రావు మినహా గెలిచిన దాఖలాలు లేవు. 1994లో సీపీఎం నుంచి ఎస్.రామ్మోహన్‌రావు గెలుపొందారు. బీసీ సామాజికవర్గం నుంచి గోలి వీరాంజనేయులు, మురుగుడు హనుమంతరావు, కాండ్రు కమల విజయం సాధించారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి రెండు పర్యాయాలు గెలుపొందడానికి పెదకాకాని వాస్తవ్యుడు కావడం, వ్యక్తిగతంగా మంచి గుర్తింపు ఉండటం, అన్నిటికన్నా మించి వై.ఎస్. కుటుంబానికి సన్నిహితులు కావడం. బీసీలకు చెందిన నియోజకవర్గంగా గుర్తింపున్న మంగళగిరి నుంచి తాను పోటీ చేయడమంటే సాహసించినట్లేనని లోకేష్ అభిప్రాయపడ్డారే తప్ప అందుకు తగిన విధంగా క్షేత్రస్థాయిలో దృష్టి సారించిన దాఖలాలు లేవు.

వైఎస్సార్ సీపీ వ్యూహాత్మక అడుగులు

వరుసగా రెండు పర్యాయాలు గెలిచిన ఆళ్ల స్థానంలో స్థానికురాలు, విద్యావంతురాలైన మురుగుడు లావణ్యను పోటీకి దింపడమే వైఎస్సార్ సీపీ విజయానికి తొలిమెట్టుగా పరిశీలకుల అభిప్రాయం. నియోజకవర్గంలో మెండుగా ఓటర్లు కలిగిన సామాజికవర్గానికి చెందిన లావణ్యది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తల్లి కాండ్రు కమల మాజీ ఎమ్మెల్యే, మామ రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉన్న వ్యక్తి. ప్రస్తుతం ఎమ్మెల్సీ కూడా. వీటికితోడు ఆ సామాజికవర్గానికి చెందిన స్థానిక సీనియర్ నాయకులైన చిల్లపల్లి మోహన్‌రావు, గంజి చిరంజీవి తదితరులకు వైఎస్సార్ సీపీ రాష్ట్రస్థాయి పదవులు కట్టబెట్టింది. కార్పొరేషన్ల డైరెక్టర్లుగా, దుర్గగుడి పాలకమండలి సభ్యులుగాను నియమించింది. ఎమ్మెల్యే ఆళ్ల ముందుచూపుతో దుగ్గిరాల (పసుపు) మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని ఎస్సీ, మైనార్టీలకు, మంగళగిరి ఏఎంసీని యాదవ, పద్మశాలి వర్గీయులకు అప్పగించారు. ఇక పార్టీ నాయకత్వం సోషల్ ఇంజినీరింగ్‌లో ఆచితూచి అడుగులేసింది. ఈ విషయంలో టీడీపీ ఎక్కడా సరితూగలేదు.



అద్భుతంగా నిర్మించిన ప్రగడ కోటయ్య, డాక్టర్ వైఎస్సార్ చేనేత భవనం

అభివృద్ధికి దిక్సూచిగా..

మంగళగిరి, తాడేపల్లి మండలాలను కలిపి కార్పొరేషన్‌ను చేయడం, ప్రత్యేక గ్రాంటుగా రూ.130 కోట్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించడం, ఎవరూ ఊహించని రీతిలో గౌతమబుద్ధ రోడ్డును అభివృద్ధి చేయడం, తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్లు, సర్వ హంగులతో వై.ఎస్.ఆర్ క్రీడాప్రాంగణాన్ని తీర్చిదిద్దడం, అంతర్గత రహదారుల విస్తరణ, అభివృద్ధి, విభిన్న సామాజికవర్గాల వారికి భవనాలు, కల్యాణ మండపాలను నిర్మించడం, ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి అభినందనలు అందుకునేలా పద్మశాలీయులకు మగ్గంలో శిక్షణ ఏర్పాట్లు నెలకొల్పడం తదితరాలు నియోజకవర్గ అభివృద్ధికి దిక్సూచిగా నిలిచాయి. పల్లెల్లో డొంక రోడ్లు, సిమెంటు రోడ్లు, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, జ్యోతిరావుపూలే, సర్దార్ వల్లభాయ్ పటేల్ తదితర ప్రముఖుల విగ్రహాల ఏర్పాట్లు నియోజకవర్గానికి అదనపు హంగులుగా మారాయి. ఆర్కే సొంతంగా నిధులు సమకూర్చడం, అవినీతికి తావు లేకుండా పనులు చేయడం, తరతమ భేదం లేకుండా అన్ని సామాజికవర్గాలకు చేరువగా ఉండటం పార్టీకి అన్నివిధాలా కలిసొచ్చింది.

కార్పొరేట్ తరహాలో లోకేష్ బృందం..

మంగళగిరి నుంచే పోటీచేయాలని నిర్ణయించుకున్న లోకేష్ అందుకు తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్లలేదని స్వపక్షీయులే అంటున్నారు. అధికారంలో ఉన్న సమయంలో కాని, ఆ తరువాతైనా వ్యూహం కొరవడిందంటున్నారు. నియోజకవర్గానికి చుట్టపుచూపుగా రావడం, అతితక్కువ మందిని కలవడం, స్థానికేతరుడు కావడం, ఆయన బృందం కార్పొరేట్ తరహాలో వ్యవహారాలు నడపడం ప్రజలను అంతగా ఆకట్టుకోలేకపోయాయనే విమర్శలు తొలి నుంచే ఉన్నాయి. తోపుడుబండ్లు, బడ్డీ కొట్లు ఇవ్వడం, పెళ్లికానుక పేరుతో రూ.5,000, సుమారు ఓ ఏడాదిపాటు రెండు చోట్ల అన్న క్యాంటీన్లను నడపడం వలన పెద్దగా ప్రయోజనం లేకుండా పోయిందంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే నిత్యం ప్రజల్లోనే తిరుగుతూ ఉండటాన్ని, లోకేష్ అందుబాటులో లేకపోవడాన్ని ప్రజలు బేరీజు వేసుకునే స్థితి.

కూటమి నేతలతో అంటీముట్టనట్లు..

ఎన్నికలకు కూటమి కట్టినప్పటికీ నియోజకవర్గంలో జనసేన, బీజేపీలతో అంటీముట్టనట్లే పార్టీ వ్యవహరించిందని టీడీపీ ముఖ్యులే అభిప్రాయపడుతూ వచ్చారు. సమన్వయ సమావేశం కూడా జరగకపోవడం గమనార్హం. ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లు దూరమవుతారనే భయంతో బీజేపీ వారిని దరిజేరనిచ్చిన దాఖలాలు దాదాపు లేవు. బీజేపీ, జనసేనలకు చెందిన యడ్లపాటి రఘునాథబాబు, పాతూరి నాగభూషణం, జగ్గారపు శ్రీనివాసరావు, పంచుమర్తి ప్రసాదరావు, పూర్ణచంద్రరావు, శివన్నారాయణ, చిల్లపల్లి శ్రీనివాసరావు, గాదె వెంకటేశ్వరరావు తదితర నాయకులు నియోజకవర్గం వారైనప్పటికీ వారితో కలిసి పనిచేసిన సందర్భాలు తక్కువే. వీరిలో జనసేనకు చెందిన ఒకరిద్దరికి కాస్త ప్రాధాన్యం ఇచ్చారే తప్ప బీజేపీని పట్టించుకోలేదు. సీనియర్ నాయకులకే లోకేష్ అందుబాటులో ఉండరని, సెక్యూరిటీ వారిని దాటుకుని వెళ్లలేమని, కార్పొరేట్ తరహా రాజకీయాలు కొనసాగుతున్నప్పుడు తమలాంటి వారి సంగతి ఏంటనే ప్రశ్న సామాన్య ఓటర్ల మధ్య చర్చకు దారితీయడం నష్టదాయకంగా మారిందని అంచనా వేస్తున్నారు. లోకేష్ చుట్టూ ఆయన సామాజికవర్గం నేతలు చేరడం, తమ వాడైనందున ఓట్లు వేయండని హెచ్చరిక ధోరణిలో చెప్పడం, పెత్తందారీ పోకడలతో వ్యవహరించడం, మా మాట వినకపోతే మీకు ఉపాధి ఉండదని, కౌలుకు భూములు కూడా ఇచ్చేది లేదని కొందరు భయపెట్టే రీతిలో మాట్లాడటం కూడా ఓట్లకు చేటు తెచ్చేవే అనే వ్యాఖ్యానాలు పరిశీలకుల నుంచి వినిపిస్తున్నాయి.

జనసేన నేత పవన్‌కళ్యాణ్ ఇప్పటం గ్రామం విషయంలో నానా హడావుడి చేసిన సంగతి తెలిసిందే. గ్రామంలో రోడ్డు విస్తరణపై గందరగోళం జరిగింది. స్థానికులకు మద్దతుగా నిలుస్తానని చెప్పిన పవన్ ఎన్నికల వేళ ఇప్పటం పేరెత్తకపోవడం పరిశీలనాంశం. కాగా రోడ్డు విస్తరణ, గ్రామంలో జరిగిన అభివృద్ధి తరువాత ఇప్పటం వాసులు అధికారపార్టీకి మద్దతుగా ఉంటున్నారనేది గమనించాల్సిన అంశమని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు.

న్యూస్‌రీల్

జెడ్పీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్, డెప్యూటీ కలెక్టర్ స్వాతి సందర్శించారు. ఐఏఎస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్న ఇద్దరు యువ అధికారులు జెడ్పీ పరిపాలన వ్యవస్థ, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి అంశాలను తెలుసుకునేందుకు జెడ్పీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వీరికి జెడ్పీ సీఈఓ జె.మోహనరావు, ఇన్‌చార్జ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు జెడ్పీ పాలనా వ్యవస్థ, బడ్జెట్ రూపకల్పన, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, వివిధ గ్రాంట్ల ద్వారా జెడ్పీకి వచ్చే నిధులు, ఇతర ఆదాయ మార్గాలు తదితర అంశాలను వివరించారు. జెడ్పీ పాలకవర్గం, సర్వసభ్య సమావేశాలను నిర్వహించే తీరుపై వారు చర్చించారు. గ్రామీణాభివృద్ధికి చేపడుతున్న చర్యలు, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ట్రైనీ ఐఏఎస్‌లు ఆసక్తి కనబర్చారు. కార్యక్రమంలో జెడ్పీ పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

సమ్మర్ వారాంతపు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సమ్మర్ వారాంతపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ మంగళవారం తెలిపారు. సంబల్‌పూర్–సికింద్రాబాద్ మధ్య ఈనెల 27, జూన్ 3, 10వ తేదీలలో రైలు నంబర్ 08325ను నడపనున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్–సంబల్‌పూర్ మధ్య ఈనెల 28, జూన్ 4,11వ తేదీలలో రైలు నంబర్ 08326ను తిప్పనున్నట్లు వివరించారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలనకు మంగళవారం 199 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. బుధవారం జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు 27,001 నుంచి 43వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

అభయాంజనేయుడికి విశేష పూజలు

1008 మల్లెలు, బంగారు, వెండి పుష్పాలతో అర్చన

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన జరిగాయి. దేవస్థానాన్ని రకరకాల పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ నెరుసు భూషణం దంపతులతో ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు హనుమంతుడికి 1008 మల్లెపూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వేదికపై సీతారామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం వాయుపుత్రునికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు.

జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



హాసిని



ఎస్.చరణ్

గుంటూరువెస్ట్ (క్రీడలు): జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లాకు చెందిన ఎస్.చరణ్, హాసిని ఎంపికయ్యారని జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగాధరరావు, కడియం జయరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వరకు పంజాబ్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో వీరిద్దరూ పాల్గొంటారన్నారు. ఈనెల 15 నుంచి 17 వరకు విజయవాడలో జరిగిన రాష్ట్ర పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా వీరి ఎంపిక జరిగిందన్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకే కౌంటింగ్

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ కౌంటింగ్ విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కౌంటింగ్ విధుల్లో ఉండే ఉద్యోగులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న గుంటూరు జిల్లాలోని ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతుందని, అసెంబ్లీతోపాటు పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్‌కు వేర్వేరుగా 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కౌంటింగ్ ఉద్యోగులు 4వ తేదీ ఉదయం 5 గంటలకల్లా ఏఎన్‌యూకు చేరుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు తమ ఏజెంట్ల వివరాలను అందజేయాలన్నారు. జూన్ 3వ తేదీ 2వ ర్యాండమైజేషన్ నిర్వహించిన కౌంటింగ్ సిబ్బందికి అసెంబ్లీ స్థానం కేటాయిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు సంబంధించి టేబుల్ వద్దకు తెచ్చిన కంట్రోల్ యూనిట్ వివరాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సరిచూసుకుని నమోదు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. రౌండ్ల వారీగా కంట్రోల్ యూనిట్‌లో ఉండే అభ్యర్థుల సీరియల్ ప్రకారం ఫలితాలను నిర్దేశించిన ఫార్మేట్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఉత్పన్నమయ్యే ఇబ్బందులను రిటర్నింగ్ అధికారులు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ఈవీఎంలకు సంబంధించి కంట్రోల్ ప్యానెల్‌లో ఫలితాలు వెల్లడించే ప్రక్రియను మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో పెద్ది రోజా, జీఎంసీ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఆర్డీఓ పి.శ్రీకర్, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


టీబీ అంతమే బీసీజీ వ్యాక్సినేషన్ లక్ష్యం

డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: దేశ వ్యాప్తంగా 2025 నాటికి టీబీని అంతం చేయాలనే లక్ష్యంతో టీబీ ముక్తభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెద్దవారికి ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్ మే 16 నుంచి వేస్తున్నామన్నారు. ప్రతి గురువారం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 5,83,604 మంది పెద్దవారిని గుర్తించి వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ఐదేళ్లలో క్షయ వ్యాధికి గురైన వారు, 60 సంవత్సరాలు పైబడిన వారు, షుగర్ వ్యాధి ఉన్నవారు, స్మోకింగ్ అలవాటు ఉన్నవారు, జనవరి నుంచి టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా ఉన్నవారు, బాడీ మాస్క్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్న వారు బీసీజీ వ్యాక్సిన్‌కు అర్హులని పేర్కొన్నారు. హెచ్ఐవీ బాధితులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు, అవయవ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నవారు, ఏదైనా వ్యాధితో బాధపడుతున్నవారు, 18 సంవత్సరాల్లోపు వారు, గతంలో వ్యాక్సిన్ వల్ల సైడ్ ఎఫెక్ట్‌లు వచ్చిన వారు ఈ వ్యాక్సినేషన్‌కు అనర్హులన్నారు. ఒక్కసారి వ్యాక్సిన్ వేసిన తరువాత ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున మూడు సంవత్సరాల పాటు ఆ వ్యక్తులను వైద్య సిబ్బంది పరిశీలించాలన్నారు. వ్యాక్సిన్ వేయించుకునేవారి అనుమతి పత్రం, సెల్‌ఫోన్ నంబరు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వ్యాక్సిన్ వేసిన వారి వివరాలు వెంటనే టీబీ విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. వ్యాక్సిన్ వేసిన 30 నిమిషాల వరకు వ్యాక్సినేషన్ కేంద్రంలోనే ఉంచి పరిశీలించాలన్నారు. ఒక వేళ ఏదైనా రియాక్షన్ వస్తే తక్షణమే ఆరోగ్య కేంద్రానికి తరలించాలని చెప్పారు. ప్రతి గురువారం నిర్వహించే అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ప్రతి సచివాలయం పరిధిలో వంద మందికి తగ్గకుండా వ్యాక్సిన్లు వేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు. సమావేశంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.20 అడుగుల వద్ద ఉంది.



పుత్రశోకం

- రోడ్డు ప్రమాదం మిగిల్చిన విషాదం
- ఎదిగొచ్చిన కొడుకుల్లో ఒకరు దుర్మరణం
- మరొకరు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాటం



మృతిచెందిన మహమ్మద్ హుస్సేన్ బేగ్ (ఫైల్)



చికిత్స పొందుతున్న ఇస్మాయిల్ బేగ్ (ఫైల్)

తెనాలి: చదువుకున్న కొడుకులు ప్రయోజకులయ్యారని సంతోషిస్తున్న ఆ కుటుంబంలో హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. ఉద్యోగం చేస్తున్న కొడుకు విగతజీవుడై తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. మరో కుమారుడు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి గాంధీనగర్‌లోని లెనిన్‌నగర్‌కు చెందిన మహమ్మద్ హుస్సేన్ బేగ్ (19) డిగ్రీ పూర్తిచేసుకుని హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి తమ్ముడు మహమ్మద్ ఇస్మాయిల్‌బేగ్ ఐటీఐలో మోటార్ మెకానికల్ డిప్లమా పూర్తిచేసి, హైదరాబాద్‌లోనే బాలానగర్‌లోని హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)లో అప్రెంటిస్‌గా చేస్తున్నాడు. ఎల్‌బీ నగర్ సమీపంలోని ఆదిభట్ల ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. తమ్ముడు ఇస్మాయిల్ బేగ్‌ను హెచ్ఏఎల్ వద్ద దిగబెట్టేందుకు సోమవారం ఉదయం ఇద్దరూ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఉదయం 7.15 గంటల ప్రాంతంలో అమీర్‌పేట వద్ద రోడ్డు డివైడర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న హుస్సేన్‌బేగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న తమ్ముడు ఇస్మాయిల్‌బేగ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం అతడు అక్కడి ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉన్నాడు. వీరి తండ్రి స్థానికంగా ఉన్న ఒక వస్త్రదుకాణంలో గుమాస్తాగా చేస్తున్నాడు. కుమారుడి మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతూ హుటాహుటిన హైదరాబాద్ వెళ్లారు. హుస్సేన్ భౌతికకాయాన్ని మంగళవారం తెల్లవారుజామున తెనాలి తీసుకొచ్చారు. మంగళవారం సాయంత్రం తెనాలి చెంచుపేటలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

ప్రత్యేకావసరాలు గల పిల్లల భవితకు బాట

- విద్యావకాశాలు కల్పించే దిశగా చర్యలు
- ప్రభుత్వ ఆదేశాలతో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే
- గుంటూరు జిల్లాలో 700 మంది బాలలు గుర్తింపు
- ఉచిత విద్యతోపాటు ఉపకరణాలు, ఇతర ఎన్నో ప్రయోజనాలు



ప్రత్యేకావసరాలు గల బాలల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్న సమగ్రశిక్ష సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: పుట్టుకతో వివిధ శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతున్న బాలలను గుర్తించి వారికి అందరితో సమానంగా విద్యావకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేపట్టడం ద్వారా ప్రత్యేకావసరాలు గల బాలలను గుర్తించాలని ప్రభుత్వమిచ్చిన ఆదేశాలకు అనుగుణంగా గుంటూరు జిల్లాలో సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు సహిత విద్యా విభాగ యంత్రాంగం ప్రస్తుతం సర్వేలో నిమగ్నమైంది. ప్రత్యేకావసరాలు (సీడబ్ల్యూఎస్ఎన్) గల బాలలకు ప్రభుత్వం ఉచిత విద్యావకాశాలతోపాటు శారీరక, మానసిక వైకల్యం నుంచి ఉపశమనం కలిగించేందుకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై సరైన అవగాహన లేదు. దీంతో ప్రత్యేకావసరాలు గల బాలలు ఇంటికే పరిమితమవుతున్నారు. అటువంటి పిల్లలను గుర్తించేందుకు ఈనెల ఒకటో తేదీ నుంచి జిల్లాలోని 18 మండలాల సహిత విద్యా విభాగం సిబ్బంది (ఐఈఆర్‌పీలు) గ్రామ సచివాలయాల్లో ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అర్బన్ ప్రాంతాల్లోని విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీల సహకారంతో సర్వే చేస్తున్నారు. పిల్లల వివరాలు నమోదు చేస్తున్నారు. ఈనెల ఒకటిన ప్రారంభమైన సర్వేలో ఇప్పటి వరకు జిల్లాలో 700 మంది అర్హులైన బాలలను గుర్తించారు. జూన్ తొమ్మిదో తేదీ వరకు సర్వే కొనసాగనుంది. బాలల తల్లిదండ్రులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న ప్రయోజనాలు, విద్య వల్ల కలిగే లాభాలను వివరించి అధికారులు పిల్లలను బడిలో చేర్పించనున్నారు.

తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నాం

సమగ్రశిక్ష భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు గురించి సమగ్ర సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేస్తున్నాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడిలో చేర్పించడం వల్ల వారికి వివిధ రకాల అలవెన్సులు, ఉచిత ఉపకరణాలు పొందే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకూ అందుతాయి. బోధనకు టీఎల్ఎం కిట్లతో పాటు పిల్లల వెంట భవిత కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రులకు ప్రయాణ భత్యాన్నీ ప్రభుత్వం అందిస్తోంది. సర్వే నిర్వహిస్తున్న సహిత విద్యా రిసోర్స్ సిబ్బంది తల్లిదండ్రులకు ఈ విషయాలు వివరించి బడిలో చేర్పించేందుకు వారిని ఒప్పిస్తున్నారు.

– జి. విజయలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ, గుంటూరు



సమస్యాత్మక గ్రామాల్లో ఏఎస్పీ పర్యటన



నిడుముక్కలలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న అడిషనల్ ఎస్పీ జయరామరాజు

తాడికొండ: నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారిగా నియమితులైన అడిషనల్ ఎస్పీ జయరామరాజు తాడికొండ మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా జరిగిన వివాదాలు, నమోదైన బైండోవర్ కేసులు, గతంలోని ఘటనల గురించి స్థానిక పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈ గ్రామాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల గొడవలు జరిగిన నిడుముక్కల, లాం గ్రామాల్లో ప్రత్యేక భద్రత కొనసాగుతుండటంతో ప్రస్తుత పరిస్థితి గురించి ఆరా తీశారు. ఏఎస్పీ వెంట తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎస్ఐలు అంజయ్య, రవీంద్ర బాబు పలువురు సిబ్బంది ఉన్నారు.

సజావుగా టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సంప్లిమెంటరీ

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం గుంటూరు జిల్లాలో సజావుగా జరిగాయి. టెన్త్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 పరీక్ష కేంద్రాల్లో 3,261 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 1,604 మంది హాజరయ్యారు. జూనియర్ ఇంటర్ పరీక్షలకు ఉదయం 36 కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసిన 14,923 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 14,157 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 12 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు దరఖాస్తు చేసిన 1,780 మంది విద్యార్థులకు గాను 1,643 మంది హాజరయ్యారు.

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్., తెనాలి
GDCC BANK
కేంద్ర కార్యాలయము : తెనాలి
పరిపాలనా కార్యాలయము : గుంటూరు.

మహాజన సభ సమావేశపు నోటీసు

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి., తెనాలి నెం. 530 యొక్క మహాజన సభ సమావేశము

తేది : 20-06-2024 గురువారం
సమయము : ఉదయం 11 గం॥లకు
స్థలము : బ్యాంకు పరిపాలనా కార్యాలయము, యన్.టి.ఆర్. సహకార భవన్, 2/13 బ్రాడీపేట, గుంటూరు

నందు జరుగును. కావున బ్యాంకు మహాజన సభ సభ్యులందరు సమావేశమునకు హాజరు కావలసినదిగా కోరడమైనది.
ఎజెండా అంశములు సభ్యులకు విడిగా పంపించబడును.
మహాజన సభ అనంతరం లంచ్ ఏర్పాటు చేయడమైనది.

ప్రదేశం : గుంటూరు
తేది. 29-05-2024
అన్ని సభ్య సంఘములకు

సం/- శ్రీమతి టి. కృష్ణవేణి
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ M.S.M. Inter (V) College, Guntur 10th Pass అయిన వారికి MLT, MPHW (నర్సింగ్) Agriculture, Veterinary Course లకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. 7386706839, 7386406839

PARAMEDICAL
■ ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radio graphic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఎనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజి ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225

REAL ESTATE
PLOT FOR SALE
■ గుంటూరు మార్కెట్ నుండి 12 km దూరంలో చింతపల్లిపాడు గ్రామానికి ఆనుకొని ల్యాండ్ కన్వర్షన్ ప్లాట్స్ 111 గజాలు (25x40) 375000/- మాత్రమే. 9492939269

TO-LET COMMERCIAL
■ గుంటూరు హరిహరమహల్ సినిమా హాల్ వెనుక ఇండియన్ బ్యాంక్‌పైన 1st ఫ్లోర్ 3000 Sft కమర్షియల్ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. Ph: 9848566343

SERVICES
BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌సు అందిస్తుంది.వ్యక్తిగత.విద్య.టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు. ✆ 9253560455.

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో /ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED
■ గుంటూరు గార్డెన్స్ నందు బెడ్ పేషెంట్‌ను చూసుకొనుటకు 35 సం॥లోపు మగ మనిషి కావలెను. టైమింగ్స్: 10:00 am - 7:30 pm. ✆ 7036251234
■ గుంటూరులోని ప్రముఖ హాస్పిటల్ నందు మార్కెటింగ్ చేయుటకు MBA అర్హత గల అభ్యర్థులు కావలెను. Cont: zycxbus@gmail.com ✆ 8978396042
■ గుంటూరులోని మా భూమి రియల్ ఎస్టేట్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ సిబ్బంది మరియు లేడీ టెలికాలర్స్ కావలెను. Ph: 9154321444, 8500174527
■ Wanted Motivators for admission of students to paramedical Eligibility: Soft spoken language Contact: 8332004478, 9848134028

■ MNC కంపెనీల్లో కం॥ఆపరేటర్స్, టెలికాలర్స్, సూ॥వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీస్ ఇన్‌చార్జెస్, ITI అల్ ట్రేడ్స్, హెల్పర్స్, Qul: 10th-PG, జీ: 10-25వేలు. ఫోన్ : 7993976590
■ ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్ మరియు తెలుగు DTP ఆపరేటర్ కావలెను. జీతం + కమీషన్ అర్హత: 10 ఆపైన 2/2 బ్రాడీపేట, గుంటూరు. 9876123463
■ Wanted Teachers LKG to 10th Class All Subject, Good Salary only guntur Local Cont : Viswa Janani High School, 6/1, indira colony, Sangadigunta, Guntur. 8555893767
■ హైదరాబాద్‌లో Zepto కంపెనీలో Grocery డెలివరి చేయుటకు బాయ్స్ కావలెను. ఫ్రీ భోజనం, ఫ్రీ హాస్టల్. జీతంనెలకు 40000/-సంపాదించుకునే అవకాశం. వీక్లీపేమెంట్స్.9391536380, 9133967972
■ బిజయ్ ఈ-ఫైనాన్స్ ఆఫీసు నందు పనిచేయుటకు M.S.ఆఫీసు, DTPలో అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్, తెలుగు & ఇంగ్లీషు వచ్చిన లేడీస్ స్టాఫ్ కావలెను, తెనాలి. ✆ 9032244425 / 9618483836
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217
■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు గుంటూరులోని లక్ష్మీపురం ఏరియాలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (Male)కావలెను డ్యూటీ: 12 గం. జీతం 13000, Q: 10th Pass/Ffail. ✆ 9676107661
■ ఇంటివద్దనే ఉండి పిల్లలను/ పేషెంట్లను చూసుకొనుటకు ట్రైన్డ్ నర్సులు/ఆయాలు హైదరాబాద్, విజయవాడలో పని చేయుటకు కావలెను. ఆకర్షణీయమైన జీతం + వసతి + భోజనం. ✆ 98850 25559, 91608 35559
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్సును చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024 / 9640400073

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాకేజ్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బీమా.. పాడి రైతుకు ధీమా

- వైఎస్సార్ పశుబీమా పథకం ద్వారా ప్రభుత్వం అండ
- బీమా మొత్తంలో ప్రభుత్వ వాటా 80 శాతం, రైతు వాటా 20 శాతం
- అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధకశాఖ



బాపట్ల టౌన్: వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా ప్రభుత్వం పశుపోషకులకు అండగా నిలుస్తుంది. బీమా మొత్తంలో రైతులు కేవలం 20 శాతం చెల్లిస్తే చాలు.. మిగిలిన 80 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. వైఎస్సార్ పశు బీమా పథకం కింద దేశవాళీ, సంకర జాతికి చెందిన ఆడ, మగ పశువు మృతి చెందితే రూ.30 వేలు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేలు, గొర్రెలు, మేకలు, పందులు రూ.6 వేలవరకు ఇవ్వనున్నారు. ప్రభుత్వ నిర్ణీత బీమా మొత్తం కన్నా ఎక్కువ మొత్తానికి బీమా చేయించుకోవాలంటే గేదెలు, ఆవులకు 6.4 శాతం, గొర్రెలు, మేకలు, పందులకు 6 శాతం చొప్పున పూర్తి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. గేదెలు, ఆవుల్లో గరిష్ఠంగా రూ.1.20 లక్షలు, గొర్రెలు, మేకలు, పందుల్లో రూ.15 వేలు వరకు బీమా సదుపాయం ఉంటుంది. ఒకవేళ రైతు పశువును వేరే రైతుకు అమ్మినా ఆ వివరాలు ఏడు రోజుల్లోగా తెలియజేస్తే, పాలసీని కొత్త యజమానికి వర్తింపజేస్తారు. బీమా పరిహారానికి ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలి.

ప్రీమియం చెల్లింపు ఇలా..

దేశీయ, సంకరజాతి ఆవులకు ప్రీమియం మొత్తం రూ.30 వేలకు గానూ ఎస్సీ, ఎస్టీలతో పాటు తెల్లరేషన్ కలిగిన వ్యక్తులు 3 సంవత్సరాలకు గానూ రూ.384, మిగిలిన రైతులు రూ.960 చెల్లించాలి. నాటు జాతి ఆవులు, గేదెలకు ప్రీమియం మొత్తం రూ.15 వేలకు గానూ ఎస్సీ, ఎస్టీలతోపాటు తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు 3 సంవత్సరాలకు గానూ రూ.192, మిగిలిన రైతులు రూ.480.. గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి ఎస్సీ, ఎస్టీ, రేషన్ కార్డుదారులు రూ.36, ఇతరులు రూ. 90, 2 ఏళ్లకు రూ.54.. ఇతరులు రూ.135, మూడేళ్లకు రూ.75, ఇతరులు 187.5 చొప్పున ప్రీమియం చెల్లించాలి.

రైతు భరోసా కేంద్రాలలో నమోదు..

పశు బీమా సదుపాయం కోసం రైతులు తమ సమీపంలో ఉన్న పశు వైద్యశాలలు, రైతుభరోసా కేంద్రానికి వెళ్లి తమ పశువుల వివరాలను నమోదు చేసుకొని రైతు వాటా ప్రీమియంను ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఏడాదిలో ఒక రైతుకు గరిష్ఠంగా ఐదు పశువులకు, గొర్రెలు, మేకలు, పందులు అయితే 50 జీవాలకు మాత్రమే బీమా అర్హత ఉంటుంది. 2 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగి ఒక్కసారైనా ఈనిన గేదెలు, ఆవులకు, అన్ని వయసుల మగ పశువులకు 6 నెలల వయస్సు పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు బీమా పథకం వర్తిస్తుంది.

21 రోజుల్లో పరిహారం..



పశువులకు మూడేళ్లపాటు, గొర్రెలు, మేకలు, పందులకు, 1, 2 ఏళ్ల పాటు బీమా పథకం వర్తిస్తుంది. కాలయాపన లేకుండా పశువు మరణించిన 21 రోజులలోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి బీమా మొత్తం జమ అవుతుంది. పాడిరైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు ఉపయోగించుకోవాలి. పశువు విలువలను బట్టి ఈ బీమా మొత్తం ఉంటుంది. ఆర్‌బీకేల్లో ఉండే సిబ్బంది, గోపాలమిత్రల ద్వారా పాడిరైతులు అవసరమైన సేవలు పొందాలి.

– ఎం.హనుమంతరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి





సంచార చలివేంద్రం

గుంటూరు కొరిటెపాడుకు చెందిన జొన్నలగడ్డ రాజమోహన్ గ్యాస్ స్టౌలకు మరమ్మతులు చేస్తూ జీవనం సాగించే సామాన్యుడు. వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చాలని నిర్ణయించారు. స్వచ్ఛ హృదయం చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. తన ద్విచక్ర వాహనంపై మినరల్ వాటర్ క్యాన్ పెట్టుకొని బాటసారుల దాహార్తి తీరుస్తున్నారు జొన్నలగడ్డ రాజమోహన్. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద బాటసారుల దాహార్తి తీరుస్తున్న దృశ్యాన్ని ఈ ఫొటోల్లో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

- 23 ఆంధ్రా బెటాలియన్ శిక్షణ కార్యక్రమాలు అభినందనీయం
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ హెడ్ ఎయిర్ కమోడోర్ మధుసూదనరెడ్డి




బెటాలియన్ అధికారులు, క్యాడెట్లతో మధుసూదనరెడ్డి

చీరాల టౌన్: దేశ నిర్మాణంలో యువశక్తి పాత్ర కీలకంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వి.మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చీరాలలో 23 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌ను, ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ, రైఫిల్ డ్రిల్, కవాతు, జిగ్‌జాగ్, మాక్ డ్రిల్, యుద్ధ శిక్షణ నైపుణ్యాలు, తదితర శిక్షణ కార్యక్రమాలను మధుసూదనరెడ్డి పరిశీలించారు. ఆయన క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ 23 ఆంధ్రా బెటాలియన్ పరిధిలో విజయవంతంగా పూర్తి చేస్తూ ఉత్తమ క్యాడెట్లుగా తీర్చిదిద్దుతున్న 23 బెటాలియన్ శిక్షణా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, సమాజ సేవా కార్యక్రమాలు చేయడంతో పాటుగా ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. త్రివిధ దళాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లతో పాటుగా పోలీసు విభాగాల్లో సేవలందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌సీసీ సి-సర్టిఫికేట్ ఉన్నత చదువులు చదివేందుకు సహకరిస్తుందన్నారు. సమాజ సేవా కార్యక్రమాలు, ప్రకృతి విపత్తుల సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు అందించే సేవలు గొప్పవన్నారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎన్‌సీసీ యూనిట్ల సందర్శనలో భాగంగా ఆయన బెటాలియన్‌ను పరిశీలించారు. ఎన్‌సీసీ ద్వారా క్యాడెట్లకు అందిస్తున్న శిక్షణ, థియరీ క్లాసులు, రైఫిల్ డ్రిల్ ను పరిశీలించి, ఇటీవల జరిగిన పలు క్యాంపుల్లో ప్రతిభచూపి పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ గుప్తా, గుంటూరు గ్రూపు కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్, 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సునీల్ గౌతమ్, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన తెలుగు తమ్ముళ్లు

- ముసుగులు తీసి మరీ ఎన్టీఆర్ విగ్రహాల వద్ద జయంతి వేడుకలు
- కోడ్ అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



నాగులపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తీసిన టీడీపీ కార్యకర్తలు

పర్చూరు (చినగంజాం): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతిని తెలుగు తమ్ముళ్లు మంగళవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉన్న దృష్ట్యా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో రాజకీయ పార్టీలతో ప్రమేయం ఉన్న విగ్రహాలకు ఎన్నికల కమిషన్ ముసుగులు వేసింది. జూన్ 6వ తేదీ వరకు ఈ కోడ్ అమలులో ఉండగా మే 28న ఎన్టీఆర్ జయంతి రోజున బహిరంగంగా విగ్రహాలకు ముసుగులు తొలగించి మరీ తెలుగు జయంతి వేడుకలను నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని పర్చూరు మండలం నాగులపాలెం, చెరుకూరు గ్రామాలతో పాటు యద్దనపూడి మండలం వింజనంపాడు తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేయడం, క్షీరాభిషేకాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేశారు. పలు గ్రామాలలో కార్యదర్శులు సైతం దగ్గరుండి కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం కల్పించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందని అప్పటి వరకు విగ్రహాల ముసుగులను తొలగించరాదని, ఈ విధమైన చర్యలకు పాల్పడిన వారిపై స్థానికులు ఫిర్యాదు చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గొడవలకు పాల్పడితే ఉపేక్షించం

ఆక్టోపస్ డీఎస్పీ నరసింహారావు హెచ్చరిక


అచ్చంపేట: ఎన్నికల కౌంటింగ్ సమయంలో గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి పరిస్థితిలోను ఉపేక్షించేది లేదని ఆక్టోపస్ డీఎస్పీ టి.నరశింహారావు హెచ్చరించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో మంగళవారం పోలీసు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అచ్చంపేటలో జూన్ 3,4,5 తేదీలలో లాక్‌డౌన్ అమలులో ఉంటుందన్నారు. అన్ని రకాల వ్యాపార సంస్థలు, బ్యాంకులు మూసివేయాలన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికలలో కొంతమంది గొడవలు సృష్టించారని, వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే ఎలాంటి వారైన శిక్ష తప్పదన్నారు. కొంతమందిపై బైండోవర్ కేసులు పెట్టడం జరిగిందని, మరికొంత మందిని అదుపులోకి తీసుకుంటామని, అవరసమైన వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ రోజు ప్రతి ఒక్కరూ ఇంటికే పరిమితమై టీవీలలో ఎన్నికలు ఫలితాలు తెలుసుకోవాలే తప్ప రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకోవడం, గొడవలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. ప్రస్తుతం మండలంలో 144సెక్షన్ అమలులో ఉన్నా వ్యాపార సంస్థలకు అనుమతులిచ్చామన్నారు. జూన్ 3,4,5 తేదీలలో మాత్రం వ్యాపార సంస్థలను పూర్తిగా మూసివేయాలన్నారు.

ఈవీఎం ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్ట్

రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఈ నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనలో నిందితులైన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎం.ఆంజనేయులు మంగళవారం తెలిపారు. తుమ్మకోట గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో టీడీపీకి చెందిన గోరంట్ల చంద్రశేఖర్, కారుమంచి సైదారావులను గురజాల కోర్టులో హాజరు పెట్టినట్లు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 20న పోట్ల సతీష్, జంగాల కోటేశ్వరరావు, మిద్దెపోగు మహేష్, జంగాల సైదులును అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పందేలు

సామర్లకోట జతకు ప్రథమ బహుమతి



బాపట్లటౌన్: మండలంలోని నరసాయపాలెం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్, ఎడ్ల బండ్ల యజమానుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 22 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి, నరసాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ గట్టుపల్లి ఇజ్రాయేల్‌లు రిఫ్రీలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ. 20 వేలను తూర్పు గోదావరి జిల్లా, సామర్లకోటకు చెందిన వల్లూరి సత్యేంద్ర కుమార్ ఎడ్ల జత కిలోమీటరు దూరాన్ని 5.13 నిమిషాల వ్యవధిలో చేరుకొని ప్రథమస్థానంలో నిలిచింది. రెండవ బహుమతి రూ.15 వేలు బాపట్ల మండలం, చెరువుజమ్ములపాలెం గ్రామానికి చెందిన ఎడ్లజత సాధించగా, మూడవ బహుమతి రూ. 10 వేలు స్వర్ణమండలం, స్వర్ణ గ్రామానికి చెందిన కటారి వేణుబాబు ఎడ్ల జత, నాల్గవ బహుమతి రూ.5వేలను నెల్లూరు జిల్లా, తూర్పుపాలెం గ్రామానికి చెందిన ఎడ్లజత గెలుచుకున్నాయి.

పోలీస్ అధికారులపై ఫిర్యాదులొస్తే విచారణ

పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ జిల్లా చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి నిరంజన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి నిరంజన్

మంగళగిరి: పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులొస్తే తప్పకుండా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని గుంటూరు పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ జిల్లా చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి నిరంజన్ తెలిపారు. బుధవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కాజ లాస్య రెసిడెన్సీలోని సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల, పొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లాల అధికార పరిధిగా ఉన్న ప్రాధికార సంస్థలో చైర్మన్‌తోపాటు ముగ్గురు సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుంచి డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారులపై వచ్చే ఫిర్యాదులను ప్రాధికార సంస్థ ద్వారా విచారణ చేపడతామన్నారు. సమావేశంలో జిల్లా పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ సభ్యులు విశ్రాంత అడిషనల్ ఎస్పీ కె.రఘు, సీఆర్‌డీఏ డెప్యూటీ డైరెక్టర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఐజీకార్‌తో ఎస్ఆర్ఎం వర్సిటీ ఎంఓయూ



ఎంఓయూ చేసుకుంటున్న ఐజీకార్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధులు

మంగళగిరి: ఇందిరాగాంధీ అణు పరిశోధనా కేంద్రం(ఐజీకార్ కల్పాకం)తో మండలంలోని నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. బయో మెడికల్ రీసెర్చ్, విపత్తుల రంగాలలోని విద్య, పరిశోధనా ప్రాజెక్టులు, ఇతరత్రా ప్రయోజనకర వర్క్‌షాప్‌ల నిర్వహణ కోసం రెండు సంస్థల మధ్య ఎంఓయూ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం కల్పాకం వెళ్లిన యూనివర్సిటీ వీసీ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరా, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, ఐజీకార్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట్రామన్‌ను కలిసి ఎంఓయూకు అవసరమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఎంఓయూ పత్రాలపై డాక్టర్ వెంకట్రామన్, డాక్టర్ మనోజ్ కుమార్ అరోరాలు సంతకాలు చేశారు. ఎంఓయూ వల్ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, రీసెర్చ్ ప్రాజెక్టులపై టెక్నాలజీ వినిమయం, క్షేత్రస్థాయి ప్రదర్శనలకు ఉపకరిస్తుందని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు హెడ్ డాక్టర్ కె.ఎ.సునీత, ఐజీకార్ పీహెచ్ఆర్ఎండీ ఎం.మేనక తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ గురించి ఆందోళన వద్దు

జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: క్యాన్సర్ గురించి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో మంగళవారం డీఎంఈ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల వైద్యులకు జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరుగనున్న తరగతులను డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల సత్వరమే వైద్యం అందించే వీలు కలుగుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల వైద్యులు రోగులకు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించాలన్నారు. నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లను ప్రాథమికంగా గుర్తించడానికి వివిధ రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మహిళలకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయడం వల్ల గర్భసంచి ద్వారా వచ్చే వివిధ రకాల క్యాన్సర్లను కనుగొనవచ్చని తెలిపారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షను స్క్రీనింగ్‌లో భాగం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీర్ణకోశ సమస్యలు వచ్చినప్పుడు గ్యాస్ ట్రబుల్ ఉందని తాత్కాలిక మందులు వాడకుండా సరైన వైద్యులను సంప్రదించి ఏండోస్కోపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల జీర్ణ కోశ క్యాన్సర్, పెద్ద పేగు క్యాన్సర్ వ్యాధులను గుర్తించవచ్చన్నారు. 30 ఏళ్ళు దాటినా ప్రతి మహిళా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార, అండాశయ క్యాన్సర్ స్క్రీనింగ్‌తోపాటు, మెడలో ఉండే థైరాయిడ్ గ్రంధి స్కానింగ్ చేయించుకోవాలన్నారు. శరీరంలో ఎక్కడైనా గడ్డలు వచ్చినా, మానకుండా ఉండే పుండ్లు, నోటి వెంట రక్త పడుతుండటం, బరువు తగ్గిపోవడం జరిగితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. శరీరంలో ఏ చిన్న గడ్డ వచ్చినా దానిని సూది పరీక్షల ద్వారా క్యాన్సరా కాదా నిర్ధారణ చేసుకోవాలని పేర్కొన్నారు. శరీరం నుంచి తీసివేసిన గడ్డను తప్పనిసరిగా ప్రాథమిక పరీక్షలకు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది వైద్యులూ క్యాన్సర్ రాదనే అపోహల్లో ఉంటున్నారని, క్యాన్సర్ ఎవరికైనా రావచ్చని అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను అందరూ భయపడకుండా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, ఎన్‌సీడీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, ఎస్‌పీఎం విభాగాధిపతి డాక్టర్ సీతారాం పాల్గొన్నారు.

ఐదు మండలాల్లో 1845 మంది బైండోవర్

అమరావతి: ఎన్నికల లెక్కింపుని పురస్కరించుకుని నియోజవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారనే అనుమానం ఉన్న వారిని, నేరప్రవృత్తి కలిగిన వారిని ముందస్తు జాగ్రత్తగా పోలీసు శాఖ బైండోవర్ కేసులు నమోదు చేసింది. ఐదు మండలాల్లో 1845 మందిని మంగళవారం బైండోవర్ చేశారు. అందులో అమరావతి మండలంలో 373, పెదకూరపాడు మండలంలో 366, క్రోసూరు మండలంలో 480, అచ్చంపేట మండలంలో 356, బెల్లంకొండ మండలంలో 270 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. నియోజవర్గంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యగా పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. మిగిలిన అన్ని గ్రామాల పైన పోలీసుశాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అలాగే అత్యధిక గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి సోదాలలో మారణాయుధాలు కలిగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. నియోజక వర్గంలోని అన్ని పెట్రోలు బంక్‌ల యాజమాన్యాలకు బాటిల్స్‌లో పెట్రోలు నింపవద్దని, అలాగే విడిగా పెట్రోలు పోయవద్దని ఆదేశాలు జారీచేశారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ఆటోనగర్ బ్రాంచ్, విజయవాడ (4470)
పంటకాలువ రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0866-2544770, 8331015770

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం ప్రకటన.

ఇ-వేలం తేదీ & సమయం: 21.06.2024, ఉ. 11.00 గం.లకు

రిజర్వ్ ధర: రూ. 65,30,000/- ధరావత్తు సొమ్ము: రూ. 6,53,000/-
రిజర్వ్ ధర: రూ. 96,38,000/- ధరావత్తు సొమ్ము: రూ. 9,63,800/-
రిజర్వ్ ధర: రూ. 61,44,000/- ధరావత్తు సొమ్ము: రూ. 6,14,400/-

www.canarabank.com
https://www.bankeauctions.com

తేది: 28.05.2024, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్